క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పేదలకు వరం



జీ.ఎర్రగుడిలో వైఎస్సార్ బీమా పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం అని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు నాగేష్, రామాపురం సర్పంచ్ కమాల్‌బాషా అన్నారు. ఇటీవల సచివాలయ పరిధిలో ఏడుగురు సాధారణ మరణం చెందడంతో వైఎస్సార్ బీమా పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున రూ.70 వేలు మంజూరైంది. సోమవారం నామినీలకు నగదును అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో వారి ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సూర్యతేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబులేసు, గోవిందరాజులు ఉన్నారు.

ఉచితంగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ఆయా గ్రామ సచివాలయాల్లో ఉచితంగా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సర్పంచ్ కారుమంచి మల్లికార్జున తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఫీజు రూ.3785 చెల్లిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల లబ్ధిదారులకు స్థలంపై సర్వహక్కులు లభిస్తాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఓ సుధాకర్, వీఆర్వో బాలవర్ధిరాజు ఉన్నారు.

దేవర ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని అమినాబాద్‌లో సుంకులమ్మవ్వ ఊరి దేవర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు, బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

సేవాదళ్‌లో చేరిక

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామానికి చెందిన 30 మంది యువకులు సోమవారం పోచిమిరెడ్డి సేవాదళ్ స్వచ్ఛంద సేవా సంస్థలో చేరారు. సోనూసూద్, హర్ష సాయి బ్లడ్ డొనేషన్ గ్రూపుగా యువకులు పలు రక్తదాన, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. 'జగనన్నకు తోడుగా–పేద ప్రజలకు అండగా' నినాదంతో పత్తికొండ ప్రజలకు సేవాదళ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై తామూ చేరుతున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు పెద్దరాయుడు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్‌రెడ్డి వారిని ఆహ్వానించారు.

ఈ–క్రాప్ పక్కాగా చేపట్టాలి

కృష్ణగిరి: రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న క్రాప్ బుకింగ్‌ను ఆయన సోమవారం పర్యవేక్షించారు. రబీలో దాదాపు 6 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారని తెలిపారు. ఇప్పటివరకు 4 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేసినట్లు చెప్పారు. రైతులు ఆర్బీకే అధికారులను సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

ఆస్పరి: రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పరి సీఐ హనుమంతప్ప రౌడీషీటర్లను హెచ్చరించారు. సోమవారం ఆస్పరి పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే మండల ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

8న మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: మండలం సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో 8న ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, తదితరులు తప్పక హాజరు కావాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందవరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దాసరి ఓబులేసు పరిశీలించారు. సోమవారం నందవరంతో పాటు ముగతి గ్రామంలోని పోలింగ్ బూత్‌లు 36, 37, 38, 40, 54, 55, 56, 57, 58లను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం, ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలను పర్యవేక్షించామన్నారు. కేంద్రాలలో లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, ర్యాంపులు పరిశీలించామని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆర్ఐ జెర్మియా, ఎన్నికల సూపర్‌వైజర్ ఏఎస్ఓ సూర్యప్రకాష్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంటే మిన్నగా ప్రభుత్వ బడులు



నాడు – పెండేకల్లు యూపీ స్కూల్



నేడు – సుందరంగా రూపుదిద్దుకున్న పెండేకల్లు యూపీ స్కూల్



తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకం ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంతో పిల్లలను చదివించేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

నాడు–నేడు పథకం కింద మండలంలో తొలివిడత రూ.4.95 కోట్లతో 20 పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. రెండో విడతలో రూ.14.52 కోట్లతో 38 పాఠశాలలను సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్దుతున్నారు. తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్లు యూపీ స్కూల్‌కు తొలి విడతలో రూ.22 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. రెండో విడతలో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి మరో రూ.22 లక్షలు విడుదల చేశారు. ఈ పాఠశాలలో 254 మంది విద్యార్థులు చదువుతున్నారు. అభివృద్ధి చెందిన పాఠశాలను చూసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలో రన్నింగ్ వాటర్ సౌకర్యంతో టాయిలెట్

ప్రైవేటు స్కూల్ నుంచి ప్రభుత్వ బడికి..



మా కూతురు మైత్రి, కుమారుడు విష్ణువర్ధన్‌ను రెండో తరగతి వరకు పక్క గ్రామంలోని ప్రైవేటు స్కూల్‌లో చదివించాం. గతంలో ఊర్లో బడిలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. బోధన కూడా అంతంత మాత్రమే. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బడిలో అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా బడి రూపురేఖలే మారిపోయాయి. బోధన కూడా బాగుంది. దీంతో మూడేళ్లుగా మళ్లీ ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నాం. విద్యకు ప్రాధాన్యతనిచ్చి సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు మిన్నగా సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– గౌరప్ప గోపాల్, విద్యార్థి తండ్రి, పెండేకల్లు

ఉపాధి రికార్డులు పక్కాగా ఉండాలి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించి, చేసిన పనులకు రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పరిధిలోని కూలీలకు పనులు కల్పించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓను ఉపాధి సిబ్బంది సన్మానించారు. ఏఓ రామస్వామి, ఏపీఓ శేషిరెడ్డి, ఈసీ చెన్నకేశవులు, అన్ని గ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో సోమవారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. విజేతకు రూ.25 వేలు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజక వర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి, రెండవ బహుమతి రూ.15 వేలను ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు విజయ్‌గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో గత నెల 30న కురువ మహేష్‌పై దాడి చేసిన కేసులో నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కురువ మహేష్‌పై దాడి చేయడంతోపాటు ఇతని ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేశారు. అలాగే మల్లికార్జునకు చెందిన బొలెరో వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ కేసులో ఒక వర్గానికి చెందిన ఉప్పరి కృష్ణ, శ్రీరాములుతోపాటు మరో 10 మందిని గ్రామంలోని మారెమ్మ గుడి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్కాచెల్లెమ్మలకు కొండంత ఆసరా

చిప్పగిరి: వైఎస్సార్ ఆసరా 4వ విడత కింద మండలంలోని 464 పొదుపు గ్రూపుల్లోని 4,571 మంది సభ్యులకు మంజూరైన రూ.3 కోట్ల మెగా చెక్కును సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, మండల కన్వీనర్ జూటూరు మారయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ, జనసేన పార్టీలు మోసపూరిత వాగ్దానాలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలింపించుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీనిధి జిల్లా డైరెక్టర్ విజయ లక్ష్మి, ఏసి నవీన్, ఏపీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న నాయకులు

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

హొళగుంద: మహిళా సాధికారతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం వెలుగు ఏసీ నవీన్‌కుమార్, ఏపీఎం హనుమంతు ఆధ్వర్యంలో హొళగుంద స్త్రీశక్తి భవన్‌లో జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నాయకులు ఈశా, జేసీఎస్ మండల కన్వీనర్, కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీ మల్లికార్జున, హనుమప్ప తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా వైఎస్ జగనన్న సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారని చెప్పారు. మండలంలో 199 పొదుపు గ్రూపులకు సంబంధించి ఆసరా పథకం నాలుగో విడత కింద రూ.65.19 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మహిళా సంఘం అధ్యక్షురాలు బసమ్మ, వెలుగు సీసీలు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.



హొళగుందలో పొదుపు మహిళలకు చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్నికల సమరానికి 'సిద్ధం'



ఆస్పరిలో సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: అందరం సమష్టిగా కృషి చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజక వర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. సోమవారం ఆస్పరి సమీపంలో మండల కన్వీనర్ పెద్దయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత ఆలయాల్లో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీన అనంతపురంలో నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి న్యాయం చేశారన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కాపు రామచంద్రారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, మారయ్య, సుంకర రామాంజనేయులు, దత్తాత్రేయరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మహానంది, కేశవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నరసింహులు, లక్ష్మీనారాయణ, ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎ.రామకృష్ణయ్య, సీఐ, గోనెగండ్ల



ఎస్.మాధవరాజు, తహసీల్దార్, పత్తికొండ



చంద్రశేఖర్, తహసీల్దార్, ఆలూరు



ప్రసాద్‌రాజు, తహసీల్దారు, హొళగుంద



పద్మజ, తహసీల్దార్, చిప్పగిరి



ఈరమ్మ, తహసీల్దార్, ఆస్పరి

సాధారణ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆయా మండలాలకు నియమితులైన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది వారికి పూలబొకేలు అందించి స్వాగతం పలికారు. అందరి సహకారంతో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.



షర్మిల, తహసీల్దార్, తుగ్గలి



జి.విజయలక్ష్మి, ఎంపీడీఓ, తుగ్గలి



కె.బుల్యా, తహసీల్దార్, హాలహర్వి



డి.ఓబులేసు, తహసీల్దార్, నందవరం



నరేంద్రకుమార్, ఎంపీడీఓ, ఆలూరు



అనంతాచారి, తహసీల్దార్, వెల్దుర్తి



రజాక్‌వలి, తహసీల్దార్, మద్దికెర



డి.పార్వతి, తహసీల్దార్, గోనెగండ్ల

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

హాలహర్వి: ప్రజాప్రతినిధులు సమస్యలను పరిష్కరించడంలో ఉుందుండాలని ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జున స్వామి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి మంజూరైన నిధులను సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్య పరిష్కారం కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. మల్లికార్జునపల్లి, బాపురం తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్న ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, ఎంఈఓ ఈరన్న, ఐకేపీ సీసీ శివయ్య, ఆయా గ్రామాల సర్పంచులు పద్మజ, భాగ్యలక్ష్మి, గురుదాస్‌రెడ్డి, విజయలక్ష్మి, సద్దాంహుసేన్, ఎంపీటీసీలు శ్రీవిద్య, తలారి గోపాల్, గంగమ్మ, గాదిలింగప్ప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● రూ.6 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి

మద్దికెర: రానున్న వేసవిలో మండలంలోని గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని మండలంలో రూ.6 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డీఎం ఖాన్ తెలిపారు. సోమవారం మండలంలో ఎం.అగ్రహారం, బొజ్జనాయుని పేట, మద్దికెర గ్రామాలలో జరుగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎం.అగ్రహారం గ్రామంలో ట్యాంకు నిర్మాణం పూర్తయిందన్నారు. మద్దికెర తదితర గ్రామాల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. మద్దికెరలో సాయినగర్, రాంనగర్ కాలనీలలో జల్‌జీవన్ మిషన్ కింద ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి డిపాజిట్ లేకుండా కుళాయి కనెక్షన్ ఇస్తున్నామని పంచాయతీ సలహాదారు ఆంజనేయులు అధికారులకు తెలియజేశారు. ఏఈ మయాంక్, జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు ఉన్నారు.



వివరాలు తెలియజేస్తున్న డీఈ డీఎంఖాన్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామానికి చెందిన మోదీన్ అనే విద్యార్థి ఆదివారం కారు ఢీకొనడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి సోమవారం గ్రామానికి వెళ్లి చిన్నారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ (సాంఘిక సంక్షేమ) గురుకుల బాలికల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్‌లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున 160 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 10న ఉదయం 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు ఇదే పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

నందవరం: రైతులు ఉద్యాన పంటలైన పండ్ల తోటలు, పూల తోటలపై దృష్టి సారించాలని ఏపీడీ అలిపీర సూచించారు. సోమవారం మండల పరిధిలోని ముగతి గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా అధికారులు మునగ, పండ్ల తోటలు, పూలతోటలు, ఉపాధి పనులపై గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీడీ మాట్లాడుతూ.. రైతులు మునక్కాయ, డ్రాగన్‌ఫ్రూట్, బొప్పాయి, సపోట, దానిమ్మ, గులాబీ, బంతి, చామంతి తదితర పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ పంటలు సాగు చేసే సన్నకారు రైతులకు ప్రభుత్వం 100 శాతం రాయితీ కల్పిస్తుందని వివరించారు. రాబడి పెరిగి రైతుకు ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించి అడిగినవారందరికీ పనులు కల్పించాలని సూచించారు. పనికి తగ్గ వేతనం లభిస్తుందని, ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఆపదలో 'పింఛన్' ఆసరా



వెంకన్నకు పింఛన్ ఇచ్చేందుకు వేలిముద్రలు నమోదు చేస్తున్న వలంటీర్ ఉషారాణి

దేవనకొండ: తెర్నెకల్ గ్రామానికి చెందిన వెంకన్న అనారోగ్యంతో ఓమ్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పింఛన్ తీసుకునేందుకు రాలేని పరిస్థితి ఉండడంతో విషయం తెలుసుకున్న వలంటీర్ ఉషారాణి సోమవారం కర్నూలులోని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి పింఛన్ సొమ్ము అందజేసింది. తమ వద్దకు వచ్చి పింఛన్ అందించిన వలంటీర్‌కు ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా తమలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే సర్వేలు



గోనెగండ్ల ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎన్‌క్యూఏఎస్ బృందం

గోనెగండ్ల: ఆస్పత్రులలో నెలకొన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికే సర్వేలు చేస్తున్నట్లు ఆరోగ్య శాఖ ఎన్‌క్యూఏఎస్ టీమ్ సభ్యులు కృష్ణప్రసాద్, గణేష్ నాగిరెడ్డి అన్నారు. వారు సోమవారం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలో ల్యాబ్, ఓపీ, లేబర్ గదులను పరిశీలించి అక్కడి పరిస్థితులపై సిబ్బందిని ఆరా తీశారు. వారు మాట్లాడుతూ ఎన్‌క్యూఏఎస్ టీమ్ ఢిల్లీ వైద్య బృందం ఆధ్వర్యంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో పరిశీలించిన వివరాలపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని వెల్లడించారు. డాక్టర్ రవళి, వైద్య సిబ్బంది ఉన్నారు.